సాక్షి సంగారెడ్డి

శుక్రవారం । 14 । ఏప్రిల్ । 2023



దళితుల అభ్యున్నతికి కృషి

దళితుల అభ్యున్నతికి బీఆర్ఎస్ ప్రభుత్వం కృషి చేస్తోందని నారాయణఖేడ్ ఎమ్మెల్యే భూపాల్ రెడ్డి తెలిపారు. లింగాపూర్‌లో అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించారు.

9లో



తేనె పట్టేద్దాం


శాస్త్రీయ పద్ధతిలో తేనె టీగల పెంపకంపై రైతులు దృష్టి సారించేలా శిక్షణ ఇస్తూ ప్రోత్సహిస్తోంది ములుగులోని అటవీకళాశాల, పరిశోధన సంస్థ.

8లో

ఒకరికి పాజిటివ్



పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో కరోనా నిర్ధారణ పరీక్షలు కొనసాగుతున్నాయి. గురువారం 18 మందికి కోవిడ్ ర్యాపిడ్ టెస్ట్‌లు నిర్వహించగా అందులో ఒకరికి పాజిటివ్ వచ్చినట్లు టెస్టుల నిర్వాహకుడు మనోహర్ తెలిపారు. అదేవిధంగా ఆర్టీపీసీఆర్ టెస్టులు 11 మందికి నిర్వహించినట్లు పేర్కొన్నారు.



న్యూస్‌రీల్

అంబేడ్కర్ జయంతిని విజయవంతం చేయాలి

కలెక్టర్ డాక్టర్ శరత్

సంగారెడ్డి టౌన్: జిల్లా కేంద్రంలో శుక్రవారం నిర్వహించనున్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ 132వ జయంతిని జయప్రదం చేయాలని కలెక్టర్ డాక్టర్ శరత్ కోరారు. షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో అంబేడ్కర్ జయంతి నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పాత బస్టాండ్ వద్దగల డాక్టర్ అంబేడ్కర్ విగ్రహానికి ఉదయం 9.00 గంటలకు పుష్పమాలంకరణ ఉంటుందని, అక్కడే బహిరంగ సభ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ప్రజా ప్రతినిధులు, అధికారులు, వివిధ సంఘాల నాయకులు, వివిధ కుల సంఘాల ప్రతినిధులు, ప్రజలు, అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం కోరారు.

నారాయణఖేడ్‌లో వీధికుక్కల పట్టివేత



కుక్కలను పట్టుకుంటున్న నిపుణులు

నారాయణఖేడ్: మున్సిపాలిటీ పరిధిలో వీధి కుక్కల బెడదను నివారించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. కుక్కల సంచారం పెరగడంతోపాటు నెలరోజుల్లో దాదాపు 45 మంది కుక్కకాట్లకు గురవడంతో స్థానికుల్లో ఆందోళన నెలకొంది. వీధి కుక్కల బెడదను నివారించాలని నిర్ణయించిన అధికారులు కుక్కలు పట్టుకునే నిపుణులను తెప్పించారు. గురువారం తెల్లవారుజాము నుంచే రంగంలోకి దిగిన వారు కాలనీల్లో తిరుగుతూ కుక్కలను చాకచక్యంగా పట్టుకొని వ్యానులోకి ఎక్కించారు. కుక్కలు పట్టే ప్రక్రియ రాత్రి వరకూ కొనసాగింది. పట్టుకున్న వాటిని అధికారులు జనసంచారం లేని ఇతర ప్రాంతాలకు తరలించే ఏర్పాట్లు చేస్తున్నారు.

చట్టాలపై అవగాహన



మాట్లాడుతున్న హనుమంతరావు

సంగారెడ్డి టౌన్: చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని న్యాయ సేవాధికారి సంస్థ కార్యదర్శి హనుమంతరావు అన్నారు. గురువారం సంగారెడ్డిలోని తెలంగాణ సోషల్ వెల్ఫేర్ హాస్టల్‌లో అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకొని విద్యార్థులకు న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు చట్టాలపై అవగాహన ఉండాలని, అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషి చేయాలన్నారు. అనంతరం హాస్టల్‌లోని వంటగది, భోజనశాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో హాస్టల్ వార్డెన్, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

భక్తులకు ఇబ్బందులు రానీయొద్దు

న్యాల్‌కల్(జహీరాబాద్): కుంభమేళాకు వచ్చే భక్తులకు ఇబ్బందులు కలగకుండా అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని అదనపు కలెక్టర్ వీరారెడ్డి అధికారులను ఆదేశించారు. న్యాల్‌కల్ మండల పరిధిలోని రాఘవాపూర్–హుమ్నాపూర్ శివారులో గల పంచవటి క్షేత్రంలో ఈ నెల 24 నుంచి మే5వ తేదీ వరకూ కుంభమేళా ఉత్సవాలు నిర్వహించనున్నారు. ఈ కుంభమేళాకు సంబంధించిన ఏర్పాట్లపై గురువారం వివిధ శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుంభమేళాకు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొంటారని, వారికి అసౌకర్యం కలుగకుండా అన్ని చర్యలు తీసుకోవాలన్నారు. నది స్నానాలకు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలన్నారు. అక్కడ గజఈతగాళ్లను అందుబాటులో ఉంచాలని సూచించారు. తాత్కాలిక మరుగుదొడ్లు, మూత్ర శాలలు ఏర్పాటు చేయాలన్నారు. ఎక్కడ కూడా అపరిశుభ్రత లేకుండా చూడాలన్నారు. విద్యుత్ లైన్ల ఏర్పాటు విషయంలో ఆ శాఖ అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పంచవటి క్షేత్రం పీఠాధిపతి కాశీనాథ్‌బాబ, తదితరులు పాల్గొన్నారు.

ఐఐటీహెచ్‌కు ఆవిర్భావ శోభ

- నేడు 15వ వసంతంలోకి..
- హాజరుకానున్న కృష్ణ ఎల్ల



కందిలోని ఐఐటీహెచ్

సాక్షిప్రతినిధి, సంగారెడ్డి: దేశంలోనే అత్యున్నత విద్యా సంస్థల్లో ఒకటైన ఐఐటీహెచ్ (భారతీయ సాంకేతిక విజ్ఞాన సంస్థ హైదరాబాద్) శుక్రవారం 15వ వసంతంలో అడుగిడుతోంది. ఎన్నో నూతన ఆవిష్కరణలకు వేదికైన ఈ విద్యా సంస్థ విజయవంతంగా 14 సంవత్సరాలు పూర్తి చేసుకుంది. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో 2008లో ఈ విద్యా సంస్థను కంది వద్ద నెలకొల్పారు. కేంద్ర ప్రభుత్వం అప్పట్లో ఎనిమిది కొత్త ఐఐటీలను నెలకొల్పగా, అందులో హైదరాబాద్ ఐఐటీ ఒకటి. దీన్ని కంది మండలం ఎద్దుమైలారంలో ఉన్న ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ ఆవరణలో ప్రారంభించారు. ఆ తర్వాత వందలాది ఎకరాల్లో కంది వద్ద ఈ ఐఐటీహెచ్‌ను ఏర్పాటు చేశారు. ఇప్పటికీ ఇంకా నిర్మాణాలు కొనసాగుతూనే ఉన్నాయి. ఐఐటీహెచ్ వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించాలని నిర్ణయించారు. ఈ వేడుకలకు కోవిడ్ వ్యాక్సిన్ ఉత్పత్తి చేసిన భారత్ బయోటెక్స్ వ్యవస్థాపక చైర్మన్ కృష్ణ ఎల్ల పాల్గొంటారని ఐఐటీహెచ్ వర్గాలు తెలిపాయి.

4,299 మంది విద్యార్థులు

హైదరాబాద్ ఐఐటీలో సుమారు 4,200 మంది విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసిస్తున్నారు. సుమారు 300 మంది ప్రొఫెసర్లు, అసోసియేట్, అసిస్టెంట్ ప్రొఫెసర్లు పని చేస్తున్నారు. మొత్తం 18 విభాగాల్లో వివిధ కోర్సుల్లో విద్యా బోధన జరుగుతోంది. ఇందులో చదువు పూర్తి చేసుకున్న విద్యార్థులు దేశంతో పాటు ప్రపంచ వ్యాప్తంగా పలు దేశాల్లో ఉన్నత ఉద్యోగాల్లో ఉన్నారు. పలు స్టార్టప్ కంపెనీలను నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం ఐఐటీహెచ్ డైరెక్టర్‌గా ప్రొఫెసర్ బీ.ఎస్.మూర్తి కొనసాగుతున్నారు.

100కు పైగా స్టార్టప్‌లు..

హైదరాబాద్ ఐఐటీ నూతన ఆవిష్కరణలకు వేదికైంది. సుమారు 100కు పైగా స్టార్టప్ కంపెనీలను ఈ విద్యా సంస్థ సృష్టించింది. సుమారు రూ.800 కోట్లు ఈ స్టార్టప్ కంపెనీల్లో పెట్టుబడులు ఉన్నట్లు ఐఐటీ వర్గాలు పేర్కొంటున్నాయి. ఇంటర్ డిసిప్లినరీ ప్రోగ్రామ్‌లతో పాటు, 200లకు పైగా ఆధునిక ప్రయోగశాలలు ఉన్నాయి. ఐదు పరిశోధన, వ్యవస్థాపక కేంద్రాల్లో ఉన్నత స్థాయి పరిశోధనలు కొనసాగుతున్నాయి. పలు అంతర్జాతీయ కంపెనీలు సుమారు రూ.700 కోట్ల మేరకు ఈ పరిశ్రమలపై పెట్టుబడులు పెట్టాయి. సుమారు వెయ్యి మందికి పైగా విద్యార్థులు వివిధ పరిశోధనల్లో భాగస్వాములుగా ఉన్నారు. ఈ విద్యార్థులు చేసిన పరిశోధన పత్రాలు అంతర్జాతీయ జర్నల్‌లలో ప్రచురితమయ్యాయి. 500లకు పైగా పేటెంట్‌లను కలిగి ఉన్న సుమారు రెండు వేల ప్రాజెక్టులు పని చేస్తున్నాయి.

రోడ్డు పక్కన సూర్యచంద్రుల హద్దురాయి



అధికారులు ఏర్పాటు చేసిన స్వాగత బోర్డు





సూర్యచంద్రుల హద్దురాయి

తొలగించినా పట్టించుకోని అధికారులు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్ సరిహద్దుతో పాటు రెండు జిల్లాలైన సంగారెడ్డి, రంగారెడ్డి పరిధిని సూచించే సూర్యచంద్రుల హద్దు రాయిని తొలగించి రోడ్డు పక్కన పడేశారు. గోపన్‌పల్లి నుంచి తెల్లాపూర్‌కి వెళ్లే రేడియల్ రోడ్డును ఆనుకొని హద్దురాయి ఉండేది. నిర్మాణ సమయంలో దీన్ని తొలగించారని స్థానికులు చెబుతున్నారు. ఈ విషయమై అటు మున్సిపల్ అధికారులు, ఇటు రెవెన్యూ అధికారులు పట్టించుకోవడం లేదు. మరో పక్క మున్సిపల్ అధికారులు తెల్లాపూర్ మున్సిపాలిటీ అంటూ స్వాగతం బోర్డును ఏర్పాటు చేశారు. అది కూడా మున్సిపల్ హద్దు ఒక చోట ఉంటే బోర్డును మరో చోట ఏర్పాటు చేశారు. దీంతో ఈ బోర్డు ఏర్పాటు స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. అసలు హద్దులు ఎక్కడ ఉన్నాయో అధికారులకు తెలుసా అంటూ పలువురు ప్రశ్నిస్తున్నారు.

సామాజిక అణచివేతపై పోరాడుదాం



పాదయాత్ర సీపీఎం, ప్రజా సంఘాల నాయకులు

సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు చుక్క రాములు

కొండాపూర్(సంగారెడ్డి): మనువాదానికి గోరి కడదామని, సామాజిక అణచివేతపై పోరాడుదామని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు చుక్క రాములు అన్నారు. జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సామాజిక న్యాయ వారోత్సవాల్లో భాగంగా గురువారం కంది మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి 10కె వాక్ ఫర్ సోషల్ జస్టిస్ పేరుతో పాదయాత్రను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంబేడ్కర్ రచించిన రాజ్యాంగం సవాళ్లను ఎదుర్కొంటుందని, బీజేపీ ప్రభుత్వం రాజ్యాంగంలో అనేక సవరణలకు పూనుకుందని ఆరోపించారు. భారత రాజ్యాంగం స్థానంలో మనుధర్మాన్ని తీసుకువచ్చేందుకు బీజేపీ, ఆర్ఎస్ఎస్ కుట్రలు పన్నుతోందన్నారు. సహజ వనరులను కార్పొరేట్ వ్యక్తులకు కట్టబెడుతూ దేశాన్ని ఆర్థికంగా దెబ్బతీస్తున్న బీజేపీని గద్దెదించాలన్నారు. అనంతరం కలెక్టర్ డాక్టర్ శరత్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మల్లేశం, సాయిలు, నాయకులు బాగారెడ్డి, యాదగిరి, రాజయ్య, నరసింహారెడ్డి, ప్రవీణ్, నాగేశ్వరరావు, కేవీపీఎస్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు, ఎస్ఎఫ్ఐ నాయకులు రమేశ్, మహేశ్, తదితరులు పాల్గొన్నారు.

నామినేషన్లతో వేడెక్కిన రాజకీయం

బీదర్‌లో ఎన్నికల కోలాహలం



ఇండిపెండెంట్‌గా నామినేషన్ వేస్తున్న చంద్రసింగ్

జహీరాబాద్: జహీరాబాద్‌కు పక్కనే ఉన్న రాష్ట్ర సరిహద్దు కర్ణాటకలోని బీదర్ జిల్లాలో అసెంబ్లీ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ మొదలు కావడంతో రాజకీయాలు వేడెక్కాయి. గురువారం నామినేషన్ల స్వీకరణ ఘట్టం మొదలైంది. ప్రధాన పార్టీలు ఇప్పటికే టికెట్లను ప్రకటించడంతో అభ్యర్థులు నామినేషన్ల దాఖలుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. జిల్లా పరిధిలో బీదర్, బీదర్ సౌత్, ఔరాద్, బస్వకళ్యాణ్, హుమ్నాబాద్, భాల్కి అసెంబ్లీ స్థానాలున్నాయి. కాంగ్రెస్, బీజేపీ, జేడీఎస్‌ల మధ్యే ప్రధాన పోటీ నెలకొని ఉంది. ఆమ్ ఆద్మీపార్టీ సైతం ఎన్నికల బరిలోకి అభ్యర్థులను దింపుతోంది. బీజేపీ మెజార్టీ స్థానాల్లో అభ్యర్థులను గెలిపించుకొని మరోమారు అధికారంలోకి వచ్చేందుకు పావులు కదుపుతోంది. కాంగ్రెస్ పార్టీ సైతం అధికారమే లక్ష్యంగా వ్యూహాలను రచిస్తోంది. దీంతో ఎన్నికలు రసవత్తరంగా సాగే అవకాశం ఉంది.

ఎన్నికల బరిలో ప్రధాన పార్టీల అభ్యర్థులు

బీజేపీ ఔరాద్ స్థానం నుంచి సిట్టింగ్ ఎమ్మెల్యే, పశు సంవర్థక శాఖ మంత్రిగా ఉన్న ప్రభు చౌహాన్‌ను తిరిగి ఎన్నికల బరిలోకి దింపింది. బసవకళ్యాణ్ నుంచి సిట్టింగ్ ఎమ్మెల్యే శరణు సల్గార్ పేరును ఖరారు చేశారు. బీదర్ దక్షిణ నుంచి శైలేందర్ బెల్దాళే, హుమ్నాబాద్ నుంచి సిద్ధు పాటిల్, బీదర్ నుంచి ఈశ్వర్‌సింగ్, భాల్కి నుంచి మాజీ ఎమ్మెల్యే ప్రకాష్ ఖండ్రేలకు అవకాశం కల్పించారు. కాంగ్రెస్ పార్టీ బీదర్ సిట్టింగ్ ఎమ్మెల్యే రహీంఖాన్, భాల్కి నుంచి ఈశ్వర్‌ఖండ్రే, హుమ్నాబాద్ నుంచి రాజశేఖర్ పాటిల్, బీదర్ దక్షిణ నుంచి మాజీ ఎమ్మెల్యే అశోక్ ఖేణి, ఔరాద్ నుంచి సిట్టింగ్ ఎమ్మెల్యే ప్రభు చౌహాన్‌ల అభ్యర్థిత్వాలను ఖరారు చేసింది. బసవకళ్యాణ్ నుంచి మాజీ సీఎం ధరంసింగ్ కుమారుడు విజయ్‌సింగ్‌కు అవకాశం కల్పించారు. జేడీఎస్ తరఫున బీదర్ దక్షిణ నియోజకవర్గం నుంచి సిట్టింగ్ ఎమ్మెల్యే బండెప్ప కాశీంపూర్, బీదర్ నుంచి రమేశ్ పాటిల్‌ల పేర్లను ఖరారు చేసింది.

మొదటి రోజు నాలుగు నామినేషన్లు

కర్ణాటకలోని బీదర్ జిల్లాలో ఆరు అసెంబ్లీ స్థానాలకు గాను మొదటి రోజు గురువారం నాలుగు నామినేషన్లు దాఖలయ్యాయి. హుమ్నాబాద్ అసెంబ్లీకి కాంగ్రెస్ తరఫున రెండు నామినేషన్లు రాగా, బీదర్ సౌత్ నుంచి ఒకరు, బీదర్ నుంచి ఒకరు ఇండిపెండెంట్లుగా నామినేషన్లు వేశారు. కర్ణాటక మాజీ ముఖ్యమంత్రి ధరంసింగ్ అల్లుడు చంద్రసింగ్ ఇండిపెండెంట్‌గా నామినేషన్ వేశారు. ఆయన కాంగ్రెస్ టికెట్ ఆశించినా లభించలేదు. దీంతో స్వతంత్ర అభ్యర్థిగా బీదర్ సౌత్ నియోజకవర్గం నుంచి నామినేషన్ వేశారు.

గ్రంథాలయ సేవలను సద్వినియోగం చేసుకోవాలి

- జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నరహరి రెడ్డి



పుస్తకాలను పరిశీలిస్తున్న నరహరి రెడ్డి

ఝరాసంగం(జహీరాబాద్): గ్రామాల్లోని యువత గ్రంథాలయ సేవలను సద్వినియం చేసుకోవాలని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ పట్లోళ్ల నరహరి రెడ్డి కోరారు. గురువారం మండల కేంద్రమైన ఝరాసంగంలోని గ్రంథాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. గ్రంథాలయంలో అందుతున్న సేవలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పుస్తకాల కొరత లేకుండా ఆన్ డిమాండ్ మేరకు పుస్తకాలు సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. పాఠకుల అవసరం మేరకు అన్ని రకాల పుస్తకాలను పంపిణీ చేస్తామన్నారు. ప్రస్తుత పోటీ పరీక్షలకు అవసరమైన పుస్తకాలు అందజేస్తామన్నారు. గ్రంథాలయాల్లో అన్ని రకాల పుస్తకాలు అందుబాటులో ఉన్నాయని, వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ జగదీశ్వర్, సిబ్బంది రాజు, తదితరులు పాల్గొన్నారు.

నవోదయ హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోండి

వర్గల్(గజ్వేల్): ఉమ్మడి మెదక్ జిల్లా వర్గల్ నవోదయ ఆరో తరగతి ప్రవేశ అర్హత పరీక్షకు సంబంధించిన హాల్ టికెట్లను వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలని విద్యాలయ ప్రిన్సిపాల్ రమేష్‌రావు తెలిపారు. ఈ నెల 29న ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఎంట్రెన్స్ పరీక్ష జరుగనుందని, పరీక్షకు దరఖాస్తు చేసుకున్న విద్యార్థులందరు https://navodoya.gov.in వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు.

బీజేపీలో కమిటీల బాధ్యతే కీలకం

మాజీ మంత్రి పి.బాబూమోహన్



బీజేపీలో చేరిన యువకులతో బాబూమోహన్, జిల్లా అధ్యక్షుడు నరేందర్‌రెడ్డి

జోగిపేట(అందోల్): బీజేపీలో కమిటీల బాధ్యతే కీలకమని మాజీ మంత్రి, బీజేపీ నాయకుడు బాబూమోహన్ అన్నారు. అందోలులోని రామమందిరంలో గురువారం పార్టీ నియోజకవర్గ కన్వీనర్ ఉదయ్ బాబూమోహన్ అధ్యక్షత నిర్వహించిన భూత్ స్వశక్తి కరణ్ అభియాన్ నియోజకవర్గ స్థాయి సమావేశానికి హాజరై మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరవేయడంలో కమిటీలు ముందుండాలన్నారు. రాష్ట్రంలో పార్టీకి ప్రజాదరణ పెరుగుతోందని, గ్రామాల్లో బీజేపీలో చేరేందుకు యువత ఆసక్తి చూపుతున్నారన్నారు. అనంతరం జిల్లా అధ్యక్షుడు నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గంలో కమిటీలు చురుకుగా పాల్గొంటున్నాయని, కేంద్రంలో మరోసారి బీజేపీ ప్రభుత్వం అధికారాన్ని చేపట్టడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. జహీరాబాద్ పార్లమెంట్ పార్టీ ఇన్‌చార్జి బద్దం మహిపాల్‌రెడ్డి మాట్లాడుతూ గ్రామాల్లో అధికార, ప్రతిపక్ష పార్టీల తీరును గమనిస్తూ ఎప్పటికప్పుడు రిపోర్టులు పంపాలన్నారు. అందోలు, మునిపల్లి మండలాలకు చెందిన పలువురు యువకులు బీజేపీలో చేరారు. కార్యక్రమంలో ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యదర్శి గడీల శ్రీకాంత్‌గౌడ్, పార్టీ జిల్లా సహ ఇన్‌చార్జి రామకృష్ణ, నాయకులు జగన్నాథం, కొత్త శ్రీనివాస్, అందోల్, చౌటకూరు, వట్‌పల్లి మండలాల పార్టీ అధ్యక్షులు నవీన్, శేఖర్‌గౌడ్, మధుసూధన్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు సాయి, తదితరులు పాల్గొన్నారు.

'పనులు ఆపే వరకూ ఉద్యమం'



ఆందోళన చేస్తున్న ప్రజలు, నాయకులు

హత్నూర(సంగారెడ్డి): కాలుష్యకారక పరిశ్రమను ఏర్పాటు చేయవద్దని హత్నూర మండలం వడ్డేపల్లితో పాటు పరిసర గ్రామాల ప్రజలు ఏడో రోజు గురువారం పెద్ద ఎత్తున నిరసన చేపట్టారు. హత్నూర మండలం వడ్డేపల్లి గ్రామ శివారులో 13 ఎకరాల్లో సురభి లాబరేటరీస్‌కి చెందిన కెమికల్ పరిశ్రమ పనులను వెంటనే నిలిపివేయలని నిరసిస్తూ వివిధ గ్రామాల ప్రజలు వారం రోజులుగా ఉద్యమాన్ని ఉధృతం చేస్తున్నారు. అఖిలపక్ష నాయకులు చుట్టుపక్కల గ్రామాల సర్పంచ్‌లు, ప్రజాప్రతినిధులు, విద్యార్థులు నిరసనకు మద్దతుగా ఆందోళనలో పాల్గొంటున్నారు. గురువారం దౌల్తాబాద్ గ్రామానికి చెందిన సర్పంచ్ వెంకటేశం, సాధులనగర్ మాజీ సర్పంచ్ కృష్ణ, యూత్ కాంగ్రెస్ నాయకులు ప్రసాద్‌తో పాటు పలువురు ఆందోళనకు మద్దతు తెలిపి నిరసనలో కూర్చున్నారు. పరిశ్రమ నిర్మాణ పనులను వెంటనే ఆపేసే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనియెడల ఆందోళనను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ జాగృతి జిల్లా అధ్యక్షుడు ప్రవీణ్‌రావు, సర్పంచ్ స్వరూప, ఉప సర్పంచ్ సురేశ్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

వైఎస్ హయాంలోనే నిధులు



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు, కౌన్సిలర్లు

జోగిపేట(అందోల్): డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలోనే సింగూరు కాల్వల నిర్మాణానికి రూ.89.98 కోట్లు మంజూరు అయ్యాయని జోగిపేట మున్సిపల్ కౌన్సిలర్ చిట్టిబాబు అన్నారు. గురువారం జోగిపేటలోని పార్టీ కార్యాలయంలో మున్సిపల్ కౌన్సిలర్లు సురేందర్‌గౌడ్, రంగ సురేశ్, హరికృష్ణాగౌడ్, మాజీ వార్డు సభ్యుడు ప్రవీణ్‌లు విలేకరులతో మాట్లాడారు. సింగూరు జలాలను సేద్యానికి అందించే విషయంలో దామోదర చేసిందేమి లేదని మంత్రి హరీశ్‌రావు చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. కాల్వల నిర్మాణం పూర్తయిన తర్వాత ట్రయల్ రన్‌ను అధికారికంగా నిర్వహించి పుల్కల్, అందోలు మండలాల్లోనే చెరువులను నింపిన విషయం రైతులకు తెలుసునని ఎద్దేవా చేశారు. అప్పట్లో దామోదర సింగూరు జలాలను విడుదల చేసిన వీడియోను ప్రదర్శించారు. కౌన్సిలర్ సురేందర్ గౌడ్, మాజీ కౌన్సిలర్ ప్రదీప్ గౌడ్, మాజీ ఎంపీటీసీ వెంకటేశం, కాంగ్రెస్ నాయకులు ప్రవీణ్, శరత్ బాబులు మాట్లాడుతూ డబుల్ బెడ్రూం ఇళ్లకు సంబంధించి లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా జరగలేదని, దుబాయ్‌లో నివాసం ఉంటున్న వారిని ఎలా ఎంపిక చేస్తారని ప్రశ్నించారు. కార్యక్రమంలో మాజీ వైస్ చైర్మన్ రాములు, నాయకులు మల్లేశం, రామకృష్ణ, చిట్యాల మధు, ఉల్వాల రాజు, రాజశేఖర్, భాస్కర్, యాదయ్య, వీరేశం, అనిల్, మురళి, నాగరాజు, జగ్గు, చోటు, అంజి పాల్గొన్నారు.

209 కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్లు

కలెక్టర్ డాక్టర్ శరత్



పంటల మద్దతు ధరకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ శరత్, తదితరులు

సంగారెడ్డి టౌన్: రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా యాసంగి ధాన్యం సేకరణకు ప్రణాళికతో పనిచేయాలని కలెక్టర్ డాక్టర్ శరత్ సంబంధిత అధికారులకు ఆదేశించారు. కలెక్టరేట్‌లో గురువారం యాసంగి ధాన్యం కొనుగోళ్లపై నిర్వహించిన సమీక్షలో కలెక్టర్ మాట్లాడారు. ప్రభుత్వ నిబంధనల మేరకు నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా ఆరబెట్టి, శుభ్రపర్చిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చేలా క్షేత్ర స్థాయిలో రైతులకు అవగాహన కల్పించాలన్నారు. జిల్లాలో మొత్తం 209 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశామని, 2,07,000 మెట్రిక్ టన్నుల ధాన్యం కేంద్రాలకు వచ్చే అవకాశం ఉందన్నారు. 72 గంటల్లోపు ధాన్యం డబ్బులు రైతు ఖాతాల్లో జమ అవుతాయన్నారు. కొనుగోలు కేంద్రాల్లో అవసరమైనన్ని గన్నీ బ్యాగులు, ప్యాడీ క్లీనర్లు, వేయింగ్ మిషన్లు అందుబాటులో ఉంచాలన్నారు. అన్‌లోడింగ్, కస్టమ్ మిల్లింగ్‌ను వేగవంతం చేసి నిర్ణీత సమయంలో బియ్యాన్ని డెలివరీ చేయాలని రైస్ మిల్లర్లకు ఆదేశించారు. క్షేత్రస్థాయిలో ఏమైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తేవాలన్నారు. అనంతరం పంటల మద్దతు ధరకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ వీరారెడ్డి, డీసీఎంఎస్ చైర్మన్ శివకుమార్, డీసీసీబీ వైస్ చైర్మన్ మాణిక్యం, డీఎస్ఓ వనజాత, డీసీఓ ప్రసాద్, డీఆర్డీఓ శ్రీనివాసరావు, మార్కెటింగ్ అధికారి, సివిల్ సప్లయీస్ డీఎం సుగుణాభాయ్, వ్యవసాయ శాఖ జేడీ నరసింహారావు, ఏఓలు, రెవెన్యూ డివిజనల్ అధికారులు, తహసీల్దార్లు, రైస్ మిల్లర్లు, ప్యాక్ కేంద్రాల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఓటర్ల జాబితాను పునఃపరిశీలించాలి

వివిధ కారణాలతో ఓటర్ల జాబితా నుంచి తొలగించిన పేర్లను మరోసారి క్షుణ్ణంగా పరిశీలించాలని కలెక్టర్ డాక్టర్ శరత్ సంబంధిత అధికారులకు ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో ఆర్డీఓలు, తహసీల్దార్లతో ఎన్నికల జాబితా, ఓటరు గుర్తింపు కార్డుల పంపిణీ, తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు. అర్హులైన ఏ ఒక్కరి పేరు జాబితా నుంచి తొలగిపోకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మృతి చెందిన ఓటర్లు, ఇతర ప్రాంతాలకు వలస వెళ్లిన వారి పేర్లను తొలగించే విషయంలోనూ ఒకటికి రెండుసార్లు వివరాలను సరి చూసుకోవాలని సూచించారు. తొలగించిన ప్రతి ఓటరు పేరుకు సంబంధించి స్పష్టమైన కారణాలు, ఆధారాలను పొందుపర్చాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ వీరారెడ్డి, ఆర్డీఓలు నగేశ్, రమేశ్‌బాబు, అంబదాస్, తహసీల్దార్లు, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ మహిపాల్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



తేనె పట్టేద్దాం



శాస్త్రీయ పద్ధతిలో తేనె టీగల పెంపకం

ములుగు ఫారెస్ట్ కాలేజీ అండ్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్‌లో రైతులకు శిక్షణ

తాటి జాన్‌రెడ్డి, సంగారెడ్డి డెస్క్..

వ్యవసాయానికి అనుబంధంగా తక్కువ ఖర్చుతో రైతులకు అధిక ఆదాయాన్ని తెచ్చిపెట్టే వాటిలో తేనె టీగల పెంపకం కూడా ఒకటి. వీటి పెంపకానికి వ్యయం, వనరులు, సమయ వినియోగం కూడా అతి తక్కువే. పర్యావరణంపై సానుకూల ప్రభావం చూపుతూ, పంట దిగుబడి పెంచడంలోనూ తేనె టీగల పాత్ర క్రియాశీలకం. శాస్త్రీయ పద్ధతిలో తేనె టీగల పెంపకంపై రైతులు దృష్టి సారించేలా..వారికి శిక్షణ ఇస్తూ ప్రోత్సహిస్తోంది ములుగులోని అటవీకళాశాల మరియు పరిశోధన సంస్థ. తేనె టీగల పెంపకం ద్వారా రైతులకు రెండు రకాల లాభాలు. ఒకవైపు అదనపు ఆదాయం సమకూర్చుకుంటూనే, మరోవైపు పంట దిగుబడి కూడా పెంచుకోవచ్చు.

ఐబీడీసీ రాష్ట్రంలోనే మొదటిది

ములుగులోని అటవీకళాశాల మరియు పరిశోధన సంస్థకు రాష్ట్రంలోనే మొదటిసారిగా ఇంటిగ్రేటెడ్ బీ కీపింగ్ డెవలప్‌మెంట్ సెంటర్(ఐబీడీసీ) మంజూరైంది. నేషనల్ బీ కీపింగ్ అండ్ హనీ మిషన్‌లో భాగంగా దీనిని కేటాయించారు. కళాశాల డీన్ ప్రియాంక వర్గీస్(ఐఎఫ్ఎస్), జాయింట్ డైరెక్టర్ పి.శ్రీనివాస్‌రావు(ఐఎఫ్ఎస్), డిప్యూటీ డైరెక్టర్ ఏ.వెంకటేశ్వర్లు పర్యవేక్షణలో ఐబీడీసీ ప్రాజెక్టుకు హెడ్‌గా శైలజ వ్యవహరిస్తున్నారు. ఇంకా టీమ్‌లో ప్రాజెక్టు కోర్డినేటర్ డాక్టర్ వసీమ్, వెన్నెల రెడ్డి, శశాంక్ సుదర్శన్, నరేష్‌లు పనిచేస్తున్నారు. తేనెటీగల పెంపకంలో భాగంగా రైతులను ప్రోత్సహించేందుకు ముందుగా శిక్షణ పొందినవారికి బాక్సులు కూడా అందజేశారు. పెంపకం మొదలు పెట్టాక తేనె ప్రాసెసింగ్ కూడా నామినల్ ఫీజుతో చేసి ఇస్తారు.

అధిక తేనె ఉత్పత్తికి...

మకరందం, పుప్పొడిపైనే అధిక తేనె ఉత్పత్తి ఆధారపడి ఉంటుంది. ఒక్కో బాక్సు నుంచి రెండు నుంచి నాలుగు కేజీల వరకు తేనె తీయవచ్చు. బాక్సుల నుంచి తేనె తీయడానికి 30 నుంచి 40 రోజుల వ్యవధి పడుతుంది. ఇదంతా శాస్త్రీయ పద్ధతిలోనే జరుగుతుంది. కానీ కొందరు బాక్సుల్లో చక్కెర పెట్టి కృత్రిమంగానూ తేనె ఉత్పత్తి చేస్తున్నారు. ఇది నాణ్యమైనది కాదు.

పంట దిగుబడిలో కీలకం

వివిధ రకాల పంటల దిగుబడిలోనూ తేనె టీగల పాత్ర ఉంటుంది. పూలు పూసే మొక్కల్లో పరాగ సంపర్కానికి తేనెటీగలు తోడ్పాటు అందిస్తాయి. తద్వారా పంట దిగుబడి పెరుగుతుంది. మన రాష్ట్రంలో అయితే పొద్దుతిరుగుడు, ఆవాలు, నువ్వులు, ధనియాలు, వాము, కుసుమ, పుచ్చకాయల(వాటర్‌మిలాన్) దిగుబడిలో వీటి పాత్ర ఎక్కువగానే ఉంటుంది. పంట పొలాల్లోనూ తేనె టీగల పెంపకాన్ని ఇంటిగ్రేటెడ్ ఫార్మింగ్‌గా చేసుకోవచ్చు. ఒక ఎకరా విస్తీర్ణంలో 2 నుంచి 8 బాక్సుల వరకు ఏర్పాటు చేసుకోవచ్చు. అయితే సేంద్రియ వ్యవసాయం చేసేచోట అయితేనే ఈ పెంపకానికి అనువుగా ఉంటుంది. ఫర్టిలైజర్, ఫెస్టిసైట్స్ వినియోగించే పంటల్లో మాత్రం ఇది వీలు పడదు.

పాలినేషన్ సపోర్ట్ కోసం...

మల్టీ నేషనల్ కంపెనీలు సీడ్ ప్రొడక్ట్‌లో భాగంగా పాలినేషన్ సపోర్ట్ కోసం ఏటా 4000 తేనెటీగల పెట్టెలను పొరుగురాష్ట్రం నుంచి తెప్పిస్తున్నాయి. ఇందుకోసం ఒక్కో బాక్సుకు రూ.1,500 నుంచి రూ.1,800 వరకు ఇస్తున్నారు. కేవలం ఒక్క నెల వ్యవధిలో ఈ బాక్సులను వినియోగించుకున్నందుకు దాదాపు రూ.60 నుంచి రూ.70 లక్షల వరకూ చెల్లిస్తున్నారు. ఈ ఆదాయం మన ప్రాంత రైతులకు వచ్చేలా చేసేందుకు అటవీకళాశాల, పరిశోధన సంస్థ ప్రయత్నాలు ముమ్మరం చేసింది.



బాక్సుల్లో ఉన్న తేనె టీగల గురించి రైతులకు వివరిస్తున్న అధికారి, శిక్షణకు హాజరైన రైతులు(ఫైల్)

తేనె, అదనపు ఉత్పత్తుల సేకరణ ప్రాసెసింగ్, మార్కెటింగ్‌కు కావాల్సిన మౌలిక వసతుల కల్పన అంతా అటవీకళాశాల చూసుకోనుంది. బీ వీనమ్ ఒక కేజీ కోటిరూపాయల వరకూ ఉంటుంది. సుమారు రెండు వేల బాక్సుల ద్వారా సంవత్సర కాలంలో ఒక కేజీ బీ వీనమ్ ఉత్పత్తి తీయవచ్చు. బీ పోలెన్‌లో సాధారణ చక్కెరలు, మాంసకృతులు, ఖనిజాలు, విటమిన్లు, కొవ్వు ఆమ్లాలు ఉంటాయి. ఔషధ గుణాల్లో వాడే స్వచ్ఛమైన తేనెకు ఒక్కో కేజీ నాలుగు నుంచి ఐదు వేల రూపాయల వరకూ ధర ఉంటుంది. అటవీకళాశాలలో తేనె టెస్టింగ్ కూడా నామినల్ ఫీజుతో చేస్తారు.

రైతులకు ఆదాయం వచ్చేలా..

మా కళాశాల డీన్, సీఎం ఓఎస్‌డీ ప్రియాంక వర్గీస్ గారి ప్రోత్సాహంతో రైతుల ఆదాయం పెంచుతూ, పర్యావరణాన్ని కాపాడేందుకు ఐబీడీసీ ప్రాజెక్టు రూపొందించాం. తేనెటీగల పెంపకం ద్వారా తేనె, మైనం మాత్రమే కాకుండా రాయల్ జెల్లీ, బీ వీనమ్, బీపోలెన్, ప్రాపోలీస్ ద్వారా కూడా ఎలా ఆదాయం పొందవచ్చో శిక్షణకు వచ్చే రైతులకు వివరిస్తున్నాం. ఔషధ విలువలున్న తేనెను కొంతమంది కల్తీ చేసి వ్యాపారం చేస్తున్నారు. దీనిని నిరోధించి శాస్త్రీయ పద్ధతిలో స్వచ్ఛమైన తేనెను ఉత్పత్తి చేసేందుకు ఇక్కడ శిక్షణ ఇస్తున్నాం.

–శైలజ, ఐబీడీసీ ప్రాజెక్ట్ హెడ్





నేను పెంచుతా



నా పేరు యాదగిరి, మాది సిద్దిపేట జిల్లా. అటవీకళాశాలలో తేనె టీగల పెంపకంపై శిక్షణ పొందా. పలువురి విజయగాథలు విన్నాక నాకు ఆసక్తి పెరిగింది. ఇక్కడ ఇచ్చిన శిక్షణ ఎంతగానో దోహదం చేసింది. సలహాలు, సూచనలు, బాక్సులు, టూల్స్ అన్నీ కాలేజీవారే ఇస్తారని చెప్పారు. త్వరలోనే తేనె టీగల పెంపకం ప్రారంభిస్తాం.

శిక్షణకు దరఖాస్తు ఇలా...

తేనె టీగల పెంపకంలో శిక్షణ తీసుకోవాలని అనుకునేవారు ప్రాజెక్టు కోఆర్డినేటర్ డాక్టర్ వసీమ్(7876531614)ను సంప్రదించాలి. నాలుగో విడత శిక్షణ ఏప్రిల్ 24వ తేదీ నుంచి 30వ తేదీ వరకు ఉంటుంది. ఏడురోజుల పాటు ఇచ్చే శిక్షణలో 25 మంది రైతులకు మాత్రమే అవకాశం ఉంటుంది. శిక్షణలో పాల్గొనే వారికి అల్పాహారం, భోజనంతో పాటు బస కూడా ఉచితంగానే కల్పిస్తారు. రానూపోనూ రవాణా చార్జీలు కూడా ఇస్తారు. శిక్షణ పూర్తయ్యాక రైతుల పేర్లు మధుక్రాంతి పోర్టల్‌లో రిజిస్ట్రేషన్ చేయిస్తారు. తేనెటీగల పెంపకానికి కేంద్రం నుంచి అందే రాయితీలు, సామగ్రి తదితరాలకు దీని ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు. ములుగు అటవీకళాశాల, పరిశోధన సంస్థ ఆధ్వర్యంలోనూ ఫార్మర్స్ ప్రొడ్యూసర్ ఆర్గనైజేషన్ ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు మొదలయ్యాయి.

శిక్షణ ఇలా...

తేనెటీగల రకాలు, వాటి జీవన చక్రం, జీవనం, ఆహార సేకరణ, పెంపకానికి కావాల్సిన సామగ్రి, స్థాన చలనం, తేనెటీగలకు వచ్చే వ్యాధులు, యాజమాన్య పద్ధతులు పాటించాల్సిన జాగ్రత్తలు, ఉత్పత్తులు, ఉప ఉత్పత్తులు, రాయల్ జెల్లీ, ప్రాపోలీస్, బీ వీనమ్, బీ పోలెన్, తేనె సేకరణ, ప్రాసెసింగ్, మార్కెటింగ్, తేనెటీగల పెంపకంలో లాభాలు గడించిన రైతుల సక్సెస్ స్టోరీలు ఇలా అన్నీ వివరిస్తారు.

మూడో బ్యాచ్...

ములుగులోని అటవీకళాశాల, పరిశోధన సంస్థలో ఇప్పటికే తేనె టీగల పెంపకంలో రెండు బ్యాచ్‌లకు శిక్షణ పూర్తి చేశారు. మొదటి బ్యాచ్‌కు మార్చి 14 నుంచి 20వ తేదీ వరకు శిక్షణ ఇవ్వగా, సిద్దిపేట, సంగారెడ్డి, నిజామాబాద్, మేడ్చల్, కామారెడ్డి, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలకు చెందిన 25 మంది రైతులు పాల్గొన్నారు.

- మార్చి 23వ తేదీ నుంచి 29వ తేదీ వరకు ఇచ్చిన శిక్షణలోనూ సిద్దిపేట, నిజామాబాద్, కొమురం భీం ఆసిఫాబాద్, రంగారెడ్డి, మహబూబ్‌నగర్, ములుగు, ఆదిలాబాద్ జిల్లాలకు చెందిన 25 మంది రైతులు పాల్గొన్నారు.
- మూడో బ్యాచ్ శిక్షణ ఏప్రిల్ 10వ తేదీ ప్రారంభం కాగా, 16వ తేదీతో ముగియనుంది. ఇందులో సిద్దిపేట, సంగారెడ్డి, నిజామాబాద్, ములుగు, కరీంనగర్, జిల్లాలకు చెందిన 25మంది రైతులు పాల్గొన్నారు.

పార్ట్ టైం ఉద్యోగం పేరిట మోసం

పటాన్‌చెరు టౌన్: ఓ సైబర్ నేరగాడు పార్ట్ టైం ఉద్యోగం పేరిట మహిళను మోసగించాడు. పోలీసుల కథనం ప్రకారం...అమీన్‌పూర్ పోలీసుల కథనం ప్రకారం.. అమీన్‌పూర్ పటేల్‌గూడకు చెందిన అభిరామికి గతనెల 31న పార్ట్‌టైం ఉద్యోగం పేరిట ఓ మెసేజ్ వచ్చింది. దానిపై క్లిక్ చేయగా టెలిగ్రామ్‌లోకి వెళ్లింది. అక్కడ తన వివరాలు నమోదు చేసింది. ముందుగా రూ.1000 ఇన్‌వెస్ట్ చేస్తే రూ.1300 రిటర్న్ పంపాడు. టాస్క్ పూర్తిచేసిన తర్వాత నగదు ఇస్తానని ఆశచూపి పలుదఫాలుగా రూ.53 వేల నగదురు డిపాజిట్ చేయించుకున్నాడు. తిరిగి నగదు చెల్లించాలని అభిరామి మెస్సేజ్ చేసినా స్పందించలేదు. దీంతో మోసపోయానని గుర్తించిన ఆమె సైబర్ క్రైం టోల్‌ఫ్రీ నంబర్ 1930కు కాల్‌చేసి ఫిర్యాదు చేసింది.పోలీసులు వెంటనే అభిరామి అకౌంట్ నుంచి ట్రాన్స్‌ఫర్ అయిన రూ. 48 వేలను ఫ్రీజ్ చేశారు. జరిగిన మోసంపై గురువారం బాధితురాలు అమీన్‌పూర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ప్రజ్ఞాపూర్ శివారులో గుర్తుతెలియని మృతదేహం



గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

గజ్వేల్ రూరల్: ప్రజ్ఞాపూర్ గ్రామ శివారులో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం కనిపించింది. గజ్వేల్ పోలీసుల కథనం ప్రకారం.. ప్రజ్ఞాపూర్‌కు చెందిన కదుల్ల జగదీశ్వర్ పొలం పక్కన మర్రి చెట్టుకు గుర్తు తెలియని వ్యక్తి ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. గురువారం అటుగా వెళ్లిన జగదీశ్వర్ విషయం గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చాడు. వారు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని కిందికి దించి పోస్టుమార్టం కోసం గజ్వేల్ గవర్నమెంట్ హాస్పిటల్‌కు తరలించారు. మృతుడి వయస్సు సుమారు 35 ఏళ్ల వరకు ఉంటుంది. ఒంటిపై ఎరుపు రంగు షర్ట్, నలుపు రంగు ప్యాంట్ ఉంది. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మురళి తెలిపారు. వివరాల కోసం గజ్వేల్ పోలీసులను సంప్రదించాలని సూచించారు.

ఓఆర్ఆర్ వద్ద ...

పటాన్‌చెరు టౌన్: ఎగ్జిట్-3 ఓఆర్ఆర్ వద్ద గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం కనిపించింది. పటాన్‌చెరు ఎస్సై దుర్గయ్య కథనం ప్రకారం.. మండలంలోని రుద్రారం గ్రామానికి చెందిన వంశీకృష్ణ ఓ ప్రైవేట్ స్కూల్ బస్సు డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. గురువారం ఎగ్జిట్-3 ఓఆర్ఆర్ వద్ద మూత్ర విసర్జన కోసం చెట్లపొదల్లోకి వెళ్లగా గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం కనిపించింది. ఆయన వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వగా మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం తరలించారు. మృతుడి వయస్సు 45 సంవత్సరాలు ఉంటుంది. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

భర్త ఇంటి ఎదుట ధర్నా చేసిన భార్యపై కేసు

మద్దూరు(హుస్నాబాద్): భర్త ఇంటి ఎదుట ధర్నా చేసిన భార్య, అత్తింటివారు, మరికొందరిపై కేసు నమోదైంది. ఎస్సై నారాయణ కథనం ప్రకారం.. మండలంలోని నర్సయ్యపల్లి గ్రామానికి చెందిన బద్దిపడిగె శ్రీనివాస్‌రెడ్డి ఆయన భార్య అంజలి మధ్య కొన్నేళ్లుగా గొడవలు జరుగుతున్నాయి. దీనిపై కోర్టులో కేసు నడుస్తోంది. ఈ క్రమంలో భార్య అంజలి కాపురానికి తీసుకెళ్లాలని, కుమారుడికి ఆస్తి రాసివ్వాలని కొరుతూ తల్లిదండ్రులు, గ్రామస్తులతో కలిసి శ్రీనివాస్‌రెడ్డి ఇంటి ఎదుట ధర్నా చేసింది. దీనిపై శ్రీనివాస్ రెడ్డి తల్లి ప్రమీల ఫిర్యాదు చేయడంతో అంజలి, ఆమె తల్లి దండ్రులు, గ్రామనికి చెందిన మరికొందరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు.

వడదెబ్బతో మహిళ మృతి



మహేశ్వరి (ఫైల్)

హుస్నాబాద్: హుస్నాబాద్ పట్టణం ఎల్లంబజార్‌కు చెందిన బండ మహేశ్వరి (47) వడదెబ్బతో మృతిచెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. బుధవారం కూలి పనులకు వెళ్లిన మహేశ్వరి సాయంత్రం ఇంటికి రాగానే వాంతులు, విరోచనాలతో బాధపడుతూ మృతిచెందింది. మృతురాలికి భర్త, కొడుకు ఉన్నారు.

నీటితొట్టిలో పడి రెండేళ్ల చిన్నారి మృతి



సాన్విక (ఫైల్)

దుబ్బాక: నీటితొట్టిలో పడి రెండేళ్ల చిన్నారి మృతిచెందింది. కుటుంబ సభ్యులు, గ్రామస్తుల కథనం ప్రకారం.. దౌల్తాబాద్ మండలం శేరుపల్లి గ్రామానికి చెందిన సంద సాయి కిరణ్ రమ్య దంపతులు గురువారం కూతురు సాన్విక (2)ను తాతదగ్గర ఉంచి పొలం పనులకు వెళ్లారు. ఇంట్లో ఆడుకుంటూ..తిరుగుతున్న సాన్విక ఆరుబయట ఉన్న నీటితొట్టి వద్దకు వెళ్లి ప్రమాదవశాత్తు పడిపోయింది. పాప కనిపించకపోవడంతో ఆందోళనకు గురైనా తాత, కుటుంబ సభ్యులు చుట్టుపక్కల వెతికారు. చివరికి తొట్టిలో చూడగా ఊపిరాడక కొట్టుకుంటూ స్థానిక కనిపించింది. వెంటనే చిన్నారిని బయటకు తీసి గజ్వేల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందింది. అల్లారుముద్దుగా పెంచుకుంటున్న కూతురు కళ్లముందే విగతజీవిగా మారడంతో తల్లిదండ్రుల రోదనలు మిన్నంటాయి. అయ్యో...బిడ్డా.. రెండేళ్లకే నూరేళ్లు నిండాయా అంటూ తల్లి రోదించిన తీరు కంటతడిపెట్టించింది.

దంపతుల ఆత్మహత్యాయత్నం

గజ్వేల్‌రూరల్, జగదేవ్‌పూర్(గజ్వేల్): 'డబ్బులు కట్టి మోసపోయాం. మా డబ్బులు మాకు ఇప్పించండి' అని బాధితులు ఒత్తిడి చేయడంతో భార్యాభర్తలు ఆత్మహత్యాయత్నానికి ఒడిగట్టారు. జగదేవ్‌పూర్ మండలం వట్టిపల్లి గ్రామానికి చెందిన జనగామ మాణిక్యం ఆర్ఎంపీగా పనిచేశాడు. 2017లో రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. కొన్నినెలల పాటు చికిత్స పొంది ఇంటి వద్దే ఉన్నాడు. 2018లో ఆయనకు గజ్వేల్‌కు చెందిన బంధువు చంద్రం ద్వారా సస్‌పరిహార్ మార్కెటింగ్ సీఈవో మెతుకు రవీందర్‌తో పరిచయం ఏర్పడింది. ఈక్రమంలో రవీందర్ మాయ మాటలు చెప్పి మాణిక్యంను చిట్ ఫండ్ ఏజెంట్‌గా నియమించాడు. కస్టమర్లను చిట్ ఫండ్‌లో చేర్పిస్తే లక్షకు ఆరు వేల చొప్పున నెలకు కమీషన్ వస్తుందని నమ్మించాడు. డబ్బు ఆశకుపోయిన మాణిక్యం గ్రామంలోని 10 మందిని చిట్ ఫండ్‌లో చేర్పించి దాదాపు రూ.10 లక్షల వరకు కట్టించాడు. ఐదేళ్లు గడిచినా డబ్బులు తిరిగి రాకపోవడంతో బాధితులు నిలదీశారు. ఆందోళనకు గురైన మాణిక్యం సస్ పరిహార్ గ్రూప్ సీఈవో రవీందర్‌ను అడిగితే 'త్వరలో మీ డబ్బులు చెల్లిస్తాను' అని హామీ ఇచ్చాడు. ఆ తర్వాత సీఈవో ఫోన్ ఎత్తకపోవడంతో బాధితులంతా డబ్బులు ఇప్పించాలని మాణిక్యంపై ఒత్తిడి చేశారు. గురువారం గజ్వేల్‌లోని మాణిక్యం బంధువైన చంద్రం ఇంటివద్ద గొడవకు దిగారు. దీంతో మనస్థాపానికి గురైన మాణిక్యం ఆయన భార్య ఉమారాణి పురుగుల మందు తాగారు. గమనించిన స్థానికులు వారిని గజ్వేల్‌లోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ విషయమై స్థానిక సీఐని వివరణ కోరగా ఎలాంటి ఫిర్యాదు రాలేదన్నారు.

వృద్ధుడు అదృశ్యం



దున్నపోతుల బుచ్చయ్య (ఫైల్)

కొండపాక(గజ్వేల్): పశువులను మేతకోసం తీసుకెళ్లిన ఓ వృద్ధుడు అదృశ్యమయ్యాడు. కుకునూరుపల్లి ఎస్సై పుష్పరాజ్ కథనం ప్రకారం .. మండలంలోని కోనాయిపల్లికి చెందిన దున్నపోతుల బుచ్చయ్య ఈనెల 11న ఉదయం పశువులను మేతకు తీసుకెళ్తానని ఇంటినుంచి బయటకు వెళ్లాడు. రాత్రి వరకు తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు బంధువులు, తెలిసిన వారు, వ్యవసాయ బావుల పరిసరాల్లో వెతికారు. ఆచూకీ దొరకకపోవడంతో బుచ్చయ్య కొడుకు చంద్రయ్య పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

సిద్దిపేటలో...

సిద్దిపేటకమాన్: సిద్దిపేటలో ఓ వ్యక్తి అదృశ్యమయ్యాడు. టూటౌన్ ఏసీపీ రవికుమార్ కథనం ప్రకారం.. పట్టణంలోని శంకర్‌నగర్‌కు చెందిన బాలరాజు(46) సోదరుడు అశోక్‌తో కలిసి ఉంటున్నాడు. మతిస్థిమితం లేని బాలరాజు గురువారం ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగిరాలేదు. కుటుంబ సభ్యులు ఆచూకీ కోసం ప్రయత్నించినా ఫలితం లేకుండా పోయింది. దీంతో సోదరుడు అశోక్ టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏసీపీ తెలిపారు.

20 మంది మందుబాబులకు జరిమానా

పటాన్‌చెరు టౌన్: డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడ్డ వాహనదారులకు సంగారెడ్డి కోర్టు జరిమానా విధించింది. ట్రాఫిక్ సీఐ ప్రవీణ్ రెడ్డి కథనం ప్రకారం..మంగళవారం, బుధవారం నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్‌లో 20 మంది పట్టుబడినట్లు తెలిపారు. వీరిని గురువారం సంగారెడ్డి కోర్టులో హాజరుపర్చగా జడ్జి 17 మందికి ఒక్కొక్కరికి రూ.2 వేలు, ముగ్గురికి రూ. 3 వేయ్యొప్పున జరిమానా విధించారని సీఐ వివరించారు.

భార్యతో గొడవపడి భర్త ఆత్మహత్య

పటాన్‌చెరు టౌన్: మద్యంమత్తులో భార్యతో గొడవపడ్డ ఓ వ్యక్తి ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. పటాన్‌చెరు ఏఎస్సై మల్లయ్య కథనం ప్రకారం... మండలంలోని చిన్నకంజర్ల గ్రామానికి చెందిన రాజు గౌడ్ (45) ఆటో నడుపుతూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. కొంతకాలంగా మద్యానికి బానిసయ్యాడు. ఈనెల 11న భార్య బాలమణితో గొడవపడి ఇంటినుంచి వెళ్లిపోయాడు. కుటుంబ సభ్యులు రాజుగౌడ్ కోసం గాలించగా గురువారం చిన్నకంజర్ల గ్రామశివారులో తన పొలం వద్ద చెట్టుకు ఉరివేసుకొని కనిపించాడు. పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై వివరించారు.

కారు ఢీకొని ...



ప్రమాద స్థలిని పరిశీలిస్తున్న ఎస్ఐ

న్యాల్‌కల్(జహీరాబాద్): కారు ఢీకొన్న ప్రమాదంలో ఒకరు మృతిచెందగా, మరో ఇద్దరు గాయపడ్డారు. హద్నూర్ ఎస్సై వినయ్‌కుమార్ కథనం ప్రకారం..టిక్మాల్ మండలం బొడ్మట్‌పల్లి గ్రామానికి చెందిన వీరయ్యస్వామి(42) ద్విచక్ర వాహనంపై భార్య శివలీల, కూతురు శివానితో కలిసి గంగ్వార్ నుంచి బొడ్మట్‌పల్లికి వస్తుండగా ఎస్ఎల్ఆర్ ఫంక్షన్ హాల్ వద్ద ఎదురుగా వస్తున్న కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో వీరయ్యస్వామి, భార్య, కూతురు తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం జహీరాబాద్ గవర్నమెంట్ హాస్పిటల్‌కు తరలించారు.అయితే అప్పటికే వీరయ్యస్వామి మృతి చెందాడు. పరిస్థితి విషమంగా ఉండడంతో శివలీల, శివానిలను హైదరాబాద్‌లోని నిమ్స్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి



బాలాగౌడ్ (ఫైల్)

నిజాంపేట(మెదక్): కల్వకుంట గ్రామ శివారులో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతిచెందారు. స్థానికుల కథనం ప్రకారం..మండలంలోని తిప్పన్నగుల్ల గ్రామానికి చెందిన గోట్టిపర్తి బాలాగౌడ్ (38) భార్యతో కలిసి గురువారం సిద్దిపేటకు వెళ్లాడు. తిరిగి వస్తుండగా కల్వకుంట గ్రామశివారులో జేసీబీ ఢీకొట్టింది. దీంతో ఆయన అక్కడిక్కడే చనిపోయాడు. భార్య శోభకు తీవ్రగాయాలయ్యాయి.

గాయపడ్డ యువకుడు ..



సాయిరాంరెడ్డి (ఫైల్)

పటాన్‌చెరు టౌన్: కారుప్రమాదంలో గాయపడ్డ ఓ యువకుడు చికిత్సపొందుతూ మృతిచెందాడు. పోలీసుల కథనం ప్రకారం..పటాన్‌చెరు మండలం బచ్చుగూడెంకు చెందిన సాయిరాంరెడ్డి (18) ఈనెల 5న స్నేహితుడు సాయిమోహన్‌తో కలిసి టీతాగేందుకు కారులో బచ్చుగూడెం నుంచి సర్వీస్ రోడ్డు మీదగా ముత్తంగికి బయలుదేరారు. నక్కవాగు సమీపంలోకి రాగానే కారు అదుపుతప్పి చెట్టుకు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో సాయిరాంరెడ్డికి తీవ్రగాయాలు కాగా.. మోహన్‌కు స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను స్థానిక కాంటినెంటల్ ఆసుపత్రికి తరలించగా చికిత్సపొందుతూ గురువారం సాయిరాంరెడ్డి మృతిచెందాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఇద్దరికి గాయాలు...

పటాన్‌చెరు టౌన్: టాటాఏస్‌ను కంటైనర్ ఢీకొట్టిన ఘటనలో ఇద్దరు గాయపడ్డారు. పటాన్‌చెరు పోలీసుల కథనం ప్రకారం..గురువారం మండలంలోని ముత్తంగి రింగ్ రోడ్డుపై ఆగి ఉన్న టాటాఏస్‌ను వెనుకాల నుంచి వచ్చిన కంటైనర్ ఢీకొటింది. ఈ ప్రమాదంలో టాటాఏస్ డ్రైవర్ శ్రీకాంత్(28)కు తీవ్రగాయాలుకాగా, మరో వర్కర్ రవికి స్వల్ప గాయాలయ్యాయి. తీవ్రంగా గాయపడ్డ శ్రీకాంత్‌ను చికిత్స కోసం ఓ ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

చికిత్స పొందుతున్న యువతి...



కల్పన మృతదేహం

చేగుంట(తూప్రాన్): పురుగుల మందు తాగిన మహిళ చికిత్స పొందుతూ మృతి చెందింది. మాసాయిపేట ఎస్సై ప్రకాశ్‌గౌడ్ కథనం ప్రకారం.. వెల్దుర్తి మండలం యశ్వంతరావుపేటకు చెందిన కల్పన (22)కు మూడేళ్ల క్రితం మాసాయిపేటకు చెందిన గణేశ్‌తో వివాహం అయింది. ఆ తర్వాత భర్త గణేశ్, అత్త నాగమణి తరచూ కల్పనతో గొడవపడేవారు. బుధవారం కూడా గొడవలు జరిగాయి. మనస్థాపానికి గురైన కల్పన అదేరోజు ఇంట్లో ఎవరూ లేనిసమయంలో పురుగుల మందు తాగింది. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్సనిమిత్తం తూప్రాన్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో హైదరాబాద్‌లోని గాంధీ హాస్పిటల్‌కు తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం మృతిచెందింది. మృతురాలి తండ్రి విఠల్ ఫిర్యాదు మేరకు భర్త, అత్తపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

భూంపల్లిలో గుడిసెలు ధ్వంసం



న్యాయం చేయాలని వేడుకుంటున్న బాధితులు

మిరుదొడ్డి(దుబ్బాక): వివాదాస్పద ఇంటి స్థలంతో పాటు మంత్రాలు చేస్తున్నారన్న నెపంతో కొందరు గుడిసెలు ధ్వంసం చేశారు. అడ్డుకోబోయిన వారిపై దాడిచేశారు. బాధితులు, గ్రామస్తుల కథనం ప్రకారం... దుబ్బాక మండలం గంభీర్‌పూర్ గ్రామానికి చెందిన అబ్రమైన పోచవ్వ, మధు, శ్యామల, నర్సింహులు, శ్రీకాంత్, లక్ష్మి, రాములు కుటుంబ సభ్యులతో కలిసి పదేళ్ల క్రితం భూంపల్లి మండల కేంద్రానికి వసలవచ్చారు. గ్రామ శివారులో గుడిసెలు వేసుకుని కూలిపనులు చేసుకుంటూ బతుకుతున్నారు. ఓ ఇంటి స్థలం విషయమై అదే ఏరియాలో ఉంటున్న కొందరితో తరచూ గొడవలు జరుగుతున్నాయి. ఇది దృష్టిలో పెట్టుకొని కొందరు లక్ష్మి, రాములు మంత్రాలు చేస్తున్నారని ఆరోపిస్తూ గురువారం వలసవచ్చిన వారి నాలుగు గుడిసెలను ధ్వంసం చేశారు. అడ్డుకోబోయిన పోచవ్వపై దాడి చేశారు. దీంతో ఆమె కుడి చేతికి, తలకు గాయాలయ్యాయి. ఊరినుంచి వెళ్లగొట్టాలన్న ఉద్దేశంతో నిందమోపి గుడిసెలు ధ్వంసం చేశారని బాధితులు వాపోయారు. న్యాయం చేయాలని భూంపల్లి పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై గంగరాజు తెలిపారు.